సాక్షి
కాకినాడ
మంగళవారం । 20 । ఆగస్టు । 2024



అన్నదాన భవనానికి రూ.1,01,116

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవనానికి మారిశెట్టి పోతురాజు, సునీత దంపతులు (తాడేపల్లిగూడెం)రూ 1,01,116 విరాళం అందించారు.




రాఖీ వేళ.. మృత్యుహేల

8లో

రక్షా బంధన్ వేడుక రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. తూర్పు గోదావరి జిల్లాలో ఒకరు, కాకినాడ జిల్లాలో మరొకరు మృతి చెందారు.

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ నుంచి సోమవారం సాయంత్రం 2,75,642 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజ్ వద్ద నీటి మట్టం 10.50 అడుగులుగా ఉంది. ఖరీఫ్ సాగుకు సంబంధించి డెల్టా కాలువలకు 13,800 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

మరిడమ్మ ఆలయంలో వైభవంగా చండీహోమం



చండీహోమం నిర్వహిస్తున్న వేద పండితులు

పెద్దాపురం: శ్రావణ పౌర్ణమి సందర్భంగా కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి ఆలయంలో సోమవారం చండీహోమం ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ చింతపల్లి బ్రహ్మాజీ, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు, ఉత్సవ కమిటీ సభ్యులు, వేద పండితులు చిట్టింహరి గోపాలశర్మల ఆధ్వర్యంలో అమ్మవారికి శాస్త్రోక్తంగా 700 శ్లోకాలతో అభిషేకాలు, పూజలు చేశారు. ప్రజలకు సకల శుభాలు కలగాలని చండీ హోమం నిర్వహించామని పండితులు పేర్కొన్నారు. హోమం అనంతరం కుంకుమ పూజలు, పూల పూజలు నిర్వహించారు.

వనదుర్గ అమ్మవారికి ఘనంగా చండీహోమం



రాజరాజేశ్వరి అలంకారంలో దర్శనమిచ్చిన వనదుర్గ అమ్మవారు

అన్నవరం: రత్నగిరి దుర్గామాత శ్రీ వనదుర్గ అమ్మవారికి ఐదు రోజులుగా నిర్వహిస్తున్న శ్రావణమాస జాతర మహోత్సవాలు శ్రావణ పౌర్ణిమ, సోమవారం నిర్వహించిన ప్రత్యంగిర, చండీ హోమాల పూర్ణాహుతి కార్యక్రమంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా వనదుర్గ అమ్మవారు ఒక చేతిలో శంఖం, మరో చేతిలో చక్రం, ఇంకో చేతిలో చెరకుగడ, మరో చేతిని అభయహస్తంగా సిరులొసంగే మాత రాజరాజేశ్వరిగా భక్తులకు దర్శనమిచ్చి పూజలు అందుకున్నారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు వనదుర్గ అమ్మవారికి నవగ్రహ జపాలు, శ్రీచక్రార్చన, పురుష, శ్రీ సూక్త పారాయణలు, మూల మంత్ర జపాలు, సూర్యనమస్కారాలు, సప్తశతీ పారాయణలు, మూలమంత్ర జపాలు, బాల, కన్య, సువాసినీ పూజలు నిర్వహించారు. అనంతరం పండితుల మంత్రోచ్చాటన మధ్య చండీ హోమం ప్రారంభించారు. 11 గంటలకు ఘనంగా హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం వేద పండితులు అమ్మవారికి ఆశీస్సులు అందజేశారు. వనదుర్గ అమ్మవారికి వంటకాలు నివేదించి తరువాత భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. దీంతో ఐదు రోజులుగా జరుగుతున్న శ్రావణ మాస పూజలు ముగిశాయి. ఈఓ కె.రామచంద్రమోహన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సత్యదేవుని దర్శించిన 50 వేల మంది

దేవస్థానానికి రూ.50 లక్షల ఆదాయం



అన్నవరం: రత్నగిరి సత్యదేవుని ఆలయానికి శ్రావణ పౌర్ణమి పర్వదినం సందర్భంగా సోమవారం సుమారు 50 వేల మంది భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించి పూజలు చేశారు. దేవస్థానంలో ఆదివారం రాత్రి, సోమవారం తెల్లవారుజామున పెద్ద సంఖ్యలో వివాహాలు కూడా జరిగాయి. సుమారు వంద జంటలు వివాహాలు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఇతర ప్రాంతాలలో వివాహాలు చేసుకున్న నవ దంపతులు కూడా దేవస్థానానికి విచ్చేసి స్వామి వారి వ్రతాలాచరించి దర్శనం చేసుకున్నారు. స్వామివారి వ్రతాలు 2,500 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.50 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. సుమారు ఐదు వేల మంది భక్తులకు సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో భోజనం పెట్టారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

కాకినాడ క్రైం: లింగ నిర్ధారణ పరీక్షలు చేసినా, కోరినా చట్ట ప్రకారం శిక్షార్హులు అవుతారని డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. చట్టాన్ని అతిక్రమించిన వారికి 3 నుంచి 5 ఏళ్ల వరకు జైలు శిక్ష, రూ.50 వేలు జరిమానా విధిస్తారని ఆయన అన్నారు. కాకినాడ జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నా, రిజిస్ట్రేషన్‌లు లేకుండా స్కానింగ్ సెంటర్లు నిర్వహిస్తున్నా పీసీపీఎన్‌డీటీ చట్టం టోల్ ఫ్రీ నంబర్ 1800 425 3365కు సమాచారం ఇవ్వాలన్నారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

ఘన ప్రస్థానం



వర్సిటీ ప్రవేశ ద్వారంలో ఏర్పాటు చేసిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం

- జేఎన్‌టీయూ కాకినాడ వర్సిటీ ఏర్పడి 16 సంవత్సరాలు పూర్తి
- 10 స్నాతకోత్సవాలు, 7 లక్షల పట్టాల జారీ
- దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ చొరవతో వర్సిటీ ఏర్పాటు
- నేటి వేడుకలకు హాజరుకానున్న ఉన్నత విద్యామండలి ఇన్‌చార్జి చైర్మన్ రామ్మోహనరావు, మాజీ వీసీలు



వేడుకల నిర్వహణపై సమీక్ష నిర్వహిస్తున్న ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూ కాకినాడ పదహారేళ్లు పూర్తి చేసుకుంది. తన ఘనమైన ప్రస్థానాన్ని నెమరువేసుకొనేందుకు మంగళవారం వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించుకుంటోంది. వాణిజ్య, వ్యాపార పరంగా అభివృద్ధి చెందిన కాకినాడలో విద్యారంగాన్ని మరింత అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్సిటీ ఏర్పాటుకు ముందడుగు వేశారు. ఆయన ఆగస్టు 20వ తేదీ 2008లో జేఎన్‌టీయూ కాకినాడ యూనివర్సిటీ ఏర్పాటు చేశారు. ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో ఉన్న సమయంలో దాదాపు 100 ఎకరాలకు పైబడి విస్తీర్ణంలో నగరానికి నడిమధ్యలో 1946వ సంవత్సరంలో జేఎన్‌టీయూ కాకినాడ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటైంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడ్డాక 1972 జేఎన్‌టీయూ హైదరాబాద్ యూనివర్సిటీ ఏర్పడ్డాక కాకినాడ, అనంతపురం, హైదరాబాద్ ఈ మూడు ఇంజినీరింగ్ కళాశాలలు హైదరాబాద్ యూనివర్సిటీ ఆధీనంలో ఉండేవి. తరువాత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పాత ఉమ్మడి జిల్లాలు తూర్పు, పశ్చిమ, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలో ఉన్న 264 ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలతో పాటు విజయనగరం, నరసారావుపేట, కాకినాడ ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలను ఈ యూనివర్సిటీకి అనుసంధానం చేస్తూ 2008లో వర్సిటీ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ వర్సిటీ పరిధిలో ఉన్న విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల విజయనగరం యూనివర్సిటీ పరిధిలోకి మూడేళ్ల క్రితం మారిపోగా ప్రస్తుతం పాత ఉమ్మడి జిల్లాలు తూర్పు, పశ్చిమ, కృష్ణా, గుంటూరు,ప్రకాశం జిల్లాల పరిధిలో 151 కళాశాలలు వర్సిటీకి అనుబంధంగా ఉన్నాయి.

ఐదుగురు వీసీలు..

వర్సిటీ ప్రారంభంలో తొలి ఉపకులపతిగా డాక్టర్ అల్లం అప్పారావు పనిచేశారు. తరువాత డాక్టర్ తులసీరామ్‌దాస్, వీఎస్ఎస్ కుమార్, డాక్టర్ రామలింగరాజు, డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజులు వీసీలుగా పని చేశారు. ప్రసాదరాజుకు ఈ ఏడాది అక్టోబర్ వరకూ పదవీకాలం ఉండగా కూటమి ప్రభుత్వం ఇన్‌చార్జి వీసీగా మురళీకృష్ణను నియమించింది.

రూ.100 కోట్లకు పైగా అభివృద్ధి పనులు...

వర్సిటీ ఏర్పడ్డ నాటి నుంచి నేటి వరకూ ఈ 16 సంవత్సరాల కాలంలో వర్సిటీ ప్రాంగణంలో దాదాపు రూ.100 కోట్లకు పైగా వివిధ బిల్డింగ్‌లు ఏర్పాటు చేశారు. ఇన్నోవేషన్ సెంటర్, ఐఐటీలు, స్టూడెంట్ ఎమినిటీ సెంటర్, ఎగ్జామ్స్‌సెల్, బాలుర, బాలికల వసతి గృహాలు వంటి నిర్మాణాలతో పాటు వర్సిటీ ఆవరణలో రోడ్ల నిర్మాణం పనులు చేపట్టారు. రూ.20 కోట్లతో నిర్మిస్తున్న స్నాతకోత్సవ భవనం దాదాపు పూర్తయ్యింది. అప్పటి వరకూ కళాశాలగా ఉన్న ప్రాంగణం వర్సిటీగా మారడంతో ఈ ప్రాంత రూపురేఖలు మారిపోయాయి. వర్సిటీ నాలుగు వైపులా భారీ గేట్లతో పాటు ముఖద్వారాలతో వైఎస్సార్, నెహ్రూ, గాంధీజీ వంటి ప్రముఖుల విగ్రహాలు ఏర్పాటు చేశారు.

వర్సిటీ ఆధ్వర్యంలో కొత్త కోర్సులు

కళాశాలలో 75 సంవత్సరాల నుంచి సంప్రదాయ కోర్సులు బీటెక్‌లో సీఎస్‌ఈ, ఈఈఈ, సివిల్, ఈసీఈ, మెకానికల్ వంటి సంప్రదాయ కోర్సులు ఉండగా బీటెక్‌లో పెట్రోలియం ఇంజినీరింగ్, ఫుడ్ టెక్నాలజీ వంటి కోర్సులు వర్సిటీ వచ్చాక ఏర్పాటు చేశారు. వీటితోపాటు వర్సిటీ ఆధ్వర్యంలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ టెక్నాలజీ పేరుతో డైరెక్టరేట్ ఏర్పాటుచేసి హెల్త్ సేఫ్టీ, నానో టెక్నాలజీ, బయో టెక్నాలజీ, ఫార్మాస్యూటికల్, నానో టెక్నాలజీ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ,ఏవాయినిక్స్, మాస్టర్ ఆఫ్ సైన్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వంటి కొత్త కోర్సులు ఏర్పాటు చేశారు.

ఏడు లక్షల పట్టాల జారీ..

10 స్నాతకోత్సవాలు..

వర్సిటీ ఏర్పడ్డ నాటి నుంచి ఇప్పటి వరకూ 10 స్నాతకోత్సవాలు నిర్వహించారు. నేషనల్ మ్యాథమెటీషియన్ సీఆర్ రావు, మెట్రో రైట్ సీఎండీ ఈ. శ్రీధరన్, మస్కేలర్ బాంబే పారిశ్రామికవేత్త ఎంవైఎస్ ప్రసాద్. ఇస్రో సైంటిస్ట్ సతీష్‌రెడ్డి, డీఆర్‌డీవో సైంటిస్ట్ బీవీఆర్ మోహన్‌రెడ్డి వంటి ప్రముఖులకు గౌరవ డాక్టరేట్‌లు అందజేశారు. 2012 వ సంవత్సరం నుంచి ఇప్పటి వరకూ యూనివర్సిటీ ద్వారా బీటెక్, ఎంటెక్, ఎంఫార్మసీ, ఎంబీఏ విభాగాల్లో ఇప్పటి వరకూ ఏడులక్షల పట్టాలు, 2 వేల మందికి పీహెచ్‌డీలు జారీ చేశారు.

పూర్వ విద్యార్థులే ప్రముఖులు

ఈ కళాశాలలో ఇంజినీరింగ్ విద్యను అభ్యసించి ప్రముఖ స్థానాలలో ఉన్నవారు ఉన్నారు. బెల్ సీఎండీ శాస్త్రి, శాంత బయోటెక్ అధినేత పద్మ విభూషణ్ వరప్రసాద్‌రెడ్డి, మెట్రో సీఎండీ పద్మ విభూషణ్ శ్రీధర్, ఉన్నత విద్య ముఖ్యకార్యదర్శి శ్యామలరావు ఐఏఎస్‌లు కృష్ణబాబు, రవిచంద్ర, జిల్లాకు చెందిన మాజీ ఐఏఎస్ ఎస్‌వీప్రసాద్ , ప్రముఖ పారిశ్రామికవేత్తలతో పాటు కేంద్ర రంగ సంస్థల్లో ప్రముఖ స్థానాల్లో ఉన్నవారు, శాసన సభ్యులు ఉన్నారు. జేఎన్‌టీయూ కాకినాడ యూనివర్సిటీ వీసీగా చేసిన డాక్టర్ రామలింగరాజు, ఏపీపీఎస్సీ మాజీ చైర్మన్ ఉదయభాస్కర్ ఇదే కళాశాలలో అభ్యసించారు.

వందల మందికి ఉపాధి

వర్సిటీ ఏర్పడ్డాక దాదాపు 700మందికి ఔట్‌సోర్సింగ్, తదితర విభాగాల్లో ఉపాధి కలిగింది. వంద మంది వరకూ సెక్యూరిటీ విభాగంతో పాటు నిత్యం ఏదో ఒక కార్యక్రమం నిర్వహిస్తున్న నేపథ్యంలో పరోక్షంగా మరికొంత మందికి ఉపాధి కలుగుతోంది.

నిర్వహణకు ఏర్పాట్లు



వర్సిటీ 16వ వ్యవస్థాపక వేడుకల నిర్వహణకు ఏర్పాటు చేశాం. మంగళవారం ఉదయం 10 గంటలకు కార్యక్రమాలు మొదలవుతాయి. రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ రామ్మోహనరావుతోపాటు సీపోర్టు సీఓఓ మురళీధర్, పలువురు అధికారులు పాల్గొంటున్నారు. ఐఏఎస్ ఎంవీఆర్ కృష్ణతేజ, ఐపీఎస్ పీహెచ్‌డీ రామకృష్ణలకు యంగ్ అచీవర్స్ అవార్డు ప్రదానం చేస్తాం. పూర్వవిద్యార్థులతో పాటు మాజీ వీసీలను ఆహ్వానించాం.

– డాక్టర్ మురళీకృష్ణ, ఇన్‌చార్జి వీసీ, జేఎన్‌టీయూకే

ప్రజల తరఫున పోరాడతాం


మాజీ మంత్రి దాడిశెట్టి రాజా



తుని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి దాడిశెట్టి రాజా

తుని: కూటమి మాయ మాటలను నమ్మి ప్రజలు ఓట్లు వేశారని, మూడు నెలలు అవుతున్నా సంక్షేమ పథకాలను అమలు చేయలేదని వైఎస్సార్ సీపీ తుని నియోజకవర్గం కోఆర్డినేటర్, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. సోమవారం తుని పట్టణం సమితి ఆఫీసు వీధిలో నూతనంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని రాజా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏదో చేస్తుందని ప్రజలు గంపెడు ఆశలు పెట్టుకున్నారన్నారు. రెండేళ్ల సమయం ఇస్తామని, అప్పటికీ ఏమి చేయకపోతే ప్రజా పోరాటం చేస్తామన్నారు. నిబంధనల పేరుతో పేదలకు సంక్షేమం అందించకపోతే పార్టీపరంగా ఉద్యమిస్తామన్నారు. తుని నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు సమష్టిగా పని చేయాలన్నారు. ప్రతి రోజూ సాయంత్రం 5 గంటల నుంచి తాను అందుబాటులో ఉంటానన్నారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు యనమల కృష్ణుడు, పోతల రమణ, ఏలూరి బాలు, కలిదిండి సత్యనారాయణ రాజు, మూడు మండలాలకు చెందిన ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచులు, కౌన్సిలర్లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

కనక దుర్గమ్మకు లక్ష గాజుల పూజ



తాళ్లపూడిలో అమ్మవారికి లక్షగాజుల అలంకారం

తాళ్లపూడి: స్థానిక నవదుర్గాది పరివార సహిత కనకదుర్గమ్మ ఆలయంలో శ్రావణ పూర్ణిమ సందర్భంగా సోమవారం లక్ష గాజులతో పూజా మహోత్సవం నిర్వహించారు. అమ్మవారికి గాజులు అలంకరించి కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు అల్లూరి శివప్రసాద్ ఆధ్వర్యంలో మహిళలు కుంకుమార్చన, లక్ష గాజుల పూజలో పాల్గొన్నారు. అమ్మవారికి గాజులు అలంకరించారు.

రాఖీ కట్టి.. రక్షణ కోరి..



శ్రీపాద శ్రీవల్లభ స్వామి వారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

పిఠాపురం: రాఖీ పౌర్ణమి సందర్భంగా దత్తాత్రేయుని జన్మస్థలమైన పిఠాపురంలోని ఆలయాలకు భక్తులు క్యూ కట్టారు. తెల్లవారుజాము నుంచి వేలాది మంది భక్తుల తరలిరావడంతో దత్తాత్రేయుని ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఏటా రాఖీ పౌర్ణమికి దేశ విదేశాల నుంచి భక్తులు ఇక్కడకు వచ్చి దత్తాత్రేయునికి రాఖీలు కడతారు. ఈ ఏడాది సుమారు 20 వేల మంది మహారాష్ట్ర భక్తులు తరలివచ్చి స్వామివారికి రాఖీలు కట్టి పూజలు చేశారు. పిఠాపురంలో ప్రముఖ పుణ్య క్షేత్రమైన పాదగయ కుక్కుటేశ్వరస్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో స్వామివారికి రాఖీ కడుతున్న ఆలయ ఈఓ సౌజన్య

అర్జీలను త్వరగా పరిష్కరించాలి



పిఠాపురంలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

పిఠాపురం/కాకినాడ సిటీ: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో అందిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ షణ్మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం పిఠాపురం రథాలపేట అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్లో జరిగింది. ట్రైనింగ్ కలెక్టర్ హెచ్ఎస్ భావన, ఆర్డీవో ఇట్ల కిషోర్, పెద్దాపురం డీఎల్డీవోలు ప్రసాదరావులతో కలిసి హాజరై, ప్రజల నుంచి కలెక్టర్ వినతులు స్వీకరించారు. ఈ అర్జీలపై త్వరితగతిన సమగ్రమైన, సంతృప్తికరమైన పరిష్కారాలు అందించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, పింఛన్ల మంజూరు, టిడ్కో గృహాలు, ఇళ్ల స్థలాలు, భూమి వివరాలు ఆన్‌లైన్లో నమోదు, ఆక్రమణల తొలగింపు, డ్రైన్, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుద్ధ్యం, సదరం సర్టిఫికెట్ మంజూరు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు వంటి అంశాలకు చెందిన 208 అర్జీలు అందినట్టు అధికారులు తెలిపారు. తొలుత కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో జరిగిన జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో కలెక్టర్ షణ్మోహన్, డీఆర్వో డాక్టర్ డి.తిప్పేనాయక్, హౌసింగ్ పీడీ ఎన్వీవీ సత్యనారాయణ, డీఆర్డీఏ పీడీ కె.శ్రీరమణి, కుడా వీసీ కృష్ణమూర్తి, సీపీవో పి.త్రినాథ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు, డీఎల్డీవోలు పి.నారాయణమూర్తిలతో కలిసి హాజరై, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం-263 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార నిమిత్తం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన అర్జీలను గడువులోపు పరిష్కరించాలన్నారు. అర్జీదారుని సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి తగిన పరిష్కారం చూపాలన్నారు. పరిష్కరించిన అర్జీల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ అర్జీల పరిష్కారాల ప్రగతిని ప్రతి శనివారం సమీక్షిస్తామని తెలిపారు. వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

పోలీస్ స్పందనకు 52 ఫిర్యాదులు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కాకినాడ క్రైం: సోమవారం కాకినాడలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో 52 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్న ఎస్పీ తక్షణ పరిష్కారం కోసం సంబంధిత ఎస్‌హెచ్‌వోలకు ఆదేశాలు జారీ చేశారు.

పారిశ్రామిక అభివృద్ధికి కృషి

కాకినాడ సిటీ: పారిశ్రామికంగా జిల్లాను అభివృద్ధి పథంలో నడిపేందుకు అవసరమైన చర్యలు చేపడతామని కలెక్టర్ షణ్మోహన్ సగిలి అన్నారు. 2024-29 కొత్త పారిశ్రామిక పాలసీ రూపకల్పన కోసం సోమవారం కలెక్టరేట్‌లో పారిశ్రామికవేత్తలు, ఇండస్ట్రియల్ యూనియన్ల ప్రతినిధులతో జిల్లా పారిశ్రామిక, ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశాన్ని నిర్వహించిన సందర్భంగా మాట్లాడారు. ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధి విధానం-2024-29, ఎంఎస్ఎంఈ, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ పాలసీ-2024-29 రూపకల్పన ప్రక్రియ చేపట్టిందన్నారు. జిల్లాలో పారిశ్రామిక వేత్తలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. పారిశ్రామిక వేత్తలు పలు సూచనలు చేశారు. జిల్లా అధికారులు కె.కృష్ణార్జునరావు, ఎ.రమణారెడ్డి, ఎన్.ఉదయభాస్కర్, బి.రాధాకృష్ణ, ప్రసాద్, సురేంద్ర ఆనంద్ పాల్గొన్నారు.

అక్రమ బియ్యం తరలింపునకు అడ్డుకట్ట

కాకినాడ పోర్టులో అక్రమ బియ్యం తరలింపు నియంత్రించడంలో చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది కీలక పాత్ర పోషించాలని కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. కాకినాడ పోర్టు వద్ద ఇటీవల ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న సీఎస్‌డీటీలు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వీఆర్వోలు, టెక్నికల్ సిబ్బందితో కలెక్టరేట్‌లో ట్రైనీ కలెక్టర్ మెహెచ్ఎస్ భావన, పౌరసరఫరాలు, పోలీస్, పోర్టు అధికారులతో కలిసి నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కాకినాడ పోర్టులో అక్రమ బియ్యం ఎగుమతులను అరికట్టే చర్యల్లో భాగంగా బొంబాయి కాట, శక్తిగేట్ వద్ద రెండు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. మంగళవారం నుంచి రెండు చెక్‌పోస్టులు 24 గంటలు పని చేస్తాయన్నారు. జిల్లా పౌరసరఫరాల అధికారి ఎంవీ ప్రసాద్, పౌరసరఫరాల సంస్థ ఎండీ ఎం.బాలసరస్వతి, కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్, కాకినాడ పోర్టు అధికారి కె.ధర్మశాస్త్ర, కాకినాడ అర్బన్ తహసీల్దార్ జితేంద్ర పాల్గొన్నారు.

వేతన జీవికి వెతలు

- ఆర్‌డబ్ల్యూఎస్‌లో ఆకలి కేకలు
- కొవ్వూరు సబ్ డివిజన్‌లో ఐదు నెలలుగా అందని జీతాలు
- రంపచోడవరం సబ్ డివిజన్‌దీ ఇదే ఇబ్బంది
- జిల్లాలో కలిసిన మరో మూడు మండలాల్లోనూ ఇదే తీరు
- డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ శాఖలో ఉద్యోగుల దయనీయ స్థితి ఇది

కొవ్వూరు: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న గ్రామీణ నీటి పారుదల, పారిశుధ్య విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్)లో ఉద్యోగులకు నెలల తరబడి జీతాలందక ఇబ్బందులు పడుతున్నారు. ఇంటి అద్దె, పిల్లల ఫీజులు, నెలవారీ చెల్లించాల్సిన ఈఎంఐలు, కుటుంబ పోషణ, ఇతర ఖర్చులకు చేతిలో చిల్లిగవ్వ లేక అల్లాడుతున్నారు. కొవ్వూరులో ఏకంగా ఐదు నెలలుగా జీతాలు రాకున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారు. కొత్త జిల్లాల ఏర్పాటుతో కొన్ని మండలాలు డివిజన్ పరిధికి మారడం, కొత్త డివిజన్‌ల ఏర్పాటుతో కొన్ని మండలాలు కొత్తగా కలవడం మూలంగా జీతాల చెల్లింపుల్లో చిక్కులు తలెత్తాయి. ఇన్నాళ్లు కొనసాగిన మండలాల ఉద్యోగులను ఏ జిల్లా పరిధిలో వారిని అక్కడికే సర్దుబాటు చేయడంతో జీతాల సమస్య తలెత్తింది. 2022 ఏప్రిల్ జిల్లా పునర్విభజన చేశారు. ఇన్నాళ్లు గతంలో ఉండే జిల్లాల పరిధిలోనే ఉద్యోగులు జీతాలు పొందారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి పరిధుల్లో మార్పులు, చేర్పులు చేయడంతో జీతాలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ డివిజన్ నుంచి రాజమహేంద్రవరంలో చేరిన గోకవరం, బిక్కవోలు, అనపర్తి మండలాల్లోను, జిల్లా నుంచి విడిపోయిన రంపచోడవరం సబ్ డివిజన్‌లో ఈ రకమైన సమస్య ఉంది. కొవ్వూరు డివిజన్‌ను విభజించడంతో కొవ్వూరు సబ్ డివిజన్‌ను రాజమహేంద్రవరంలో చేర్చారు. దీంతో ఇక్కడ పనిచేస్తున్న ఉద్యోగులకు జీతాలందడం పెద్ద సమస్యగా మారింది. ఒక్క కొవ్వూరు సబ్ డివిజన్‌లో ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు దాదాపు రూ.35 లక్షలకు పైగా జీతాల బకాయిలు రావాల్సి ఉంది. ఈ నెల నుంచి రంపచోడవరం సబ్ డివిజన్‌తో పాటు కొత్తగా చేరిన మూడు మండలాల్లోను ఇదే రకమైన పరిస్థితి ఉంది. తాగునీటి నాణ్యతను పరిశీలించే ప్రయోగశాలల్లో పనిచేసే అవుట్ సోర్సింగ్ సిబ్బందికి ఐదు నెలలుగా జీతాలు అందడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా ల్యాబ్స్‌లో పనిచేసే అవుట్ సోర్సింగ్ సిబ్బంది జీతాలు అందడం లేదని ఆ సంఘ నాయకులు చెబుతున్నారు.

ఐదు నెలలుగా అందని జీతాలు

కొవ్వూరు సబ్ డివిజన్ పరిధిలో నల్లజర్ల, దేవరపల్లి, గోపాలపురం, కొవ్వూరు, తాళ్లపూడి, చాగల్లు మండలాలకు చెందిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, మినిస్ట్రీరియల్ సిబ్బంది, డీఈలకు ఏప్రిల్ నుంచి జీతాలు అందడం లేదు. కొవ్వూరులో ఉండే ఆర్‌డబ్ల్యూఎస్ డివిజన్‌ను విభజించి జిల్లాల పునర్విభజన సమయంలో భీమవరం తరలించారు. ఇన్నాళ్లు కొవ్వూరు సబ్ డివిజన్‌లో పనిచేసే సిబ్బందికి భీమవరం ఈఈ కార్యాలయం ద్వారానే జీతాలు పొందారు. కొవ్వూరు సబ్ డివిజన్‌ను రాజమహేంద్రవరంలో ఆర్‌డబ్ల్యూఎస్ డివిజన్ పరిధిలోకి చేర్చడంతో ఏప్రిల్ నుంచి ఇక్కడ పనిచేస్తున్న నాలుగో తరగతి ఉద్యోగి నుంచి డీఈఈ వరకు జీతాలు నిలిచిపోయాయి. ఇన్నాళ్లు భీమవరం ఈఈ కార్యాలయం పరిధిలో ఉన్న వీరిని రాజమహేంద్రవరం ఈఈ పరిధికి బదిలీ చేశారు. మార్చి 31వ తేదీన భీమవరం ఈఈ కార్యాలయం ఈ మేరకు (అవుట్) ఉత్తర్వులు జారీ చేసింది. రాజమహేంద్రవరం ఈఈ కార్యాలయం పరిధిలోకి చేర్చుకున్నట్లు(ఇన్) అదే రోజు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ పూర్తి కావాలంటే ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు విడుదల కావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. డివిజన్ పరిధిలో తొలగించినా, చేర్చిన ఉద్యోగులకు సంబంధించిన వివరాలను సైతం సీఎంఎఫ్ఎస్‌లో నమోదు కావాల్సి ఉంటుందన్నారు. అప్పుడే డ్రాయింగ్ అధికారుల లాగిన్‌లో వారి వివరాలు కనిపిస్తాయని అధికారులు చెబుతున్నారు.



కొవ్వూరు ఆర్‌డబ్ల్యూఎస్ డివిజన్ కార్యాలయం

రెండు నెలల పాటు జీతాలు కష్టమే..

రంపచోడవరం సబ్ డివిజన్‌ను అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా పరిధిలో చేర్చారు. దీంతో రాజమహేంద్రవరం పరిధిలో ఉన్న ఈ సబ్ డివిజన్‌ను (అవుట్) తొలగించారు. దీంతో ఈ సబ్ డివిజన్ పరిధిలో ఉండే 16 ఏఈలు, డీఈ, ఇతర ఉద్యోగులు జీతాలు పొందే పరిస్థితి లేదు. వీరంతా మన్యం జిల్లాలో మ్యాపింగ్ కావాల్సి ఉంటుంది. దీంతో వీరు రెండు నెలల పాటు జీతాలు పొందడం కష్టమే అంటున్నారు.

చిరుద్యోగులకు పాట్లు

నీటి నాణ్యతా ప్రయోగశాలల్లో అవుట్ సోర్సింగ్ పద్ధతిపై పనిచేసే సిబ్బంది ఆకలి కేకలు వేస్తున్నారు. ఏప్రిల్ నెల నుంచి వీరికి జీతాలు అందడం లేదు. సబ్ డివిజన్ పరిధిలో తాగునీటి పరీక్షల నిమిత్తం ఒక కెమిస్టు, మైక్రో బయోలాజిస్టు, ఇద్దరు ల్యాబ్ అసిస్టెంట్లు ఉంటారు. డివిజన్ ల్యాబ్‌లో మరో రెండు పోస్టులు అదనంగా ఉంటాయి. హెల్పర్, శాంపిల్ కలెక్టర్‌లు అదనంగా ఉంటారు. వీరి జీతం రూ.13 వేల నుంచి గరిష్టంగా రూ.22 వేలు ఉంటుంది.

క్లుప్తంగా

బంగారు గొలుసు చోరీ

నిడదవోలు రూరల్: ఆరుబయట ఇంటిని శుభ్రం చేస్తున్న వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసు తెంచుకుని ఇద్దరు పారిపోయిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు సమిశ్రగూడెం ఎస్సై రమేష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నిడదవోలు మండలం సమిశ్రగూడెం గ్రామానికి చెందిన కోట్ల వరలక్ష్మి సోమవారం ఉదయం ఇంటి వాకిలి శుభ్రం చేస్తుండగా బైక్‌పై ఇద్దరు యువకులు వచ్చారు. ఆమె మెడలో ఉన్న మూడున్నర కాసుల బంగారు గొలుసును బలవంతంగా లాక్కుని పరారయ్యారు. దీంతో వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

పోలీసుల అదుపులో నిందితుడు

రాజానగరం: వృద్ధురాలి మెడలో సుమారు రూ. లక్ష విలువ చేసే బంగారు గొలుసును దొంగిలించిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సీఐ ఎస్‌పీ వీరయ్యగౌడ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మేడిశెట్టి సూర్యాకాంతం తన భర్త మృతితో ఒంటరిగా ఉండలేక, మేనల్లుడి ఆసరాతో చక్రద్వారబంధంలోని ఒక తాటాకింట్లో ఉంటుంది. ఎప్పటిలాగే ఈ నెల 16 తెల్లవారుజామున మేనల్లుడు సీతాఫలాల తోటలోకి వెళ్లాడు. ఆ వృద్ధురాలు ఒంటరిగా ఉందని గమనించిన రాయుడు అప్పారావు (పండు) వెంటనే అక్కడకు చేరుకుని, ఆమె మెడలో ఉన్న రెండు కాసుల బంగారు గొలుసును బలవంతంగా లాక్కున్నాడు. ఇదే క్రమంలో ఆమె చెవిదుద్దులు కూడా లాగడంతో ఒక చెవికి గాయమైంది. చెవి దుద్దులు వదిలేసి, బంగారు గొలుసుతో పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదుతో అప్పారావును అరెస్ట్ చేశామని సీఐ తెలిపారు. కోర్టు అతనికి రిమాండ్ విధించిందన్నారు.

రాఖీ వేళ.. మృత్యుహేల

- రక్ష కోసం వెళితే కక్ష కట్టిన విధి
- ఓ ఘటనలో తల్లి మృతి
- మరోచోట బాలిక దుర్మరణం



కనకాల సత్యశ్రీ (ఫైల్)



ఘటనా స్థలంలో మృతి చెందిన సత్యశ్రీ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాఖీ పౌర్ణమి వేళ మృత్యు గంట మోగింది.. అనుబంధాలను దూరం చేసింది.. రక్ష కోసం వెళ్తే విధి కక్ష కట్టింది.. రక్షా బంధన్ వేడుక ఆ కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.. తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాల్లో జరిగిన ఘటనలు ప్రతి హృదయాన్నీ కలచివేసింది.. తన కూతురితో కుమారుడికి రాఖీ కట్టించి వస్తుండగా ఓ తల్లి మృతి చెందగా, మరో ఘటనలో బాలిక దుర్మరణం పాలవ్వడం తీవ్ర విషాదంలోకి నెట్టేసింది. ఈ హృదయ విదారక ఘటనల్లోకి వెళ్తే.. కోనసీమ జిల్లా కొత్తపేటకు చెందిన కనకాల సత్యశ్రీ (42)కి ఇద్దరు పిల్లలు. కుమారుడు కాతేరు తిరుమల కళాశాలలోని హాస్టల్‌లో ఉంటూ ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఏటా ఆ ఇంట రాఖీ వేడుకలు చేస్తుంటారు. సోమవారం ఉదయమే తలస్నానం చేసిన సత్యశ్రీ ఏటా మాదిరిలానే తన తమ్ముడికి రాఖీ కట్టింది. అలాగే తన కుమారుడికి కుమార్తెతో ఎలాగైనా రక్షాబంధన్ కట్టించాలనుకుంది. తన తమ్ముడిని బతిమాలి కుమార్తెతో సహా ద్విచక్ర వాహనంపై రాజమహేంద్రవరం రూరల్ కాతేరుకు బయల్దేరి కుమారుడిని కలిసింది. తాను దగ్గరుండి మరీ కుమార్తెతో రాఖీ కట్టించి స్వీట్లు తినిపించి కొంతసేపు ఆనందంగా గడిపింది. కొడుకుకి వీడ్కోలు చెప్పిన ఆమెకు అదే చివరి వీడ్కోలు అవుతుందనుకోలేదు. తన తమ్ముడు, కుమార్తెతో కలసి తిరిగి కొత్తపేటకు బయల్దేరింది. కాతేరు ఎర్రకాలువ సమీపంలో ఎదురుగా రాంగ్ రూట్‌లో వచ్చిన వ్యాన్ వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ప్రమాద ధాటికి వారంతా ఎగిరిపడ్డారు. ఈ ఘటనలో సత్యశ్రీ తలకు తీవ్ర గాయమై ఘటనా స్థలంలోనే దుర్మణం పాలైంది. ఆమె తమ్ముడు, కుమార్తెలకు గాయాలయ్యాయి. వారి కళ్లముందే సత్యశ్రీ మృతి చెందడం చూసిన వారు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఘటనా స్థలంలోనే వారు రోదించడం చూపరులను కంటతడి పెట్టించింది. ఈ విషయం తెలిసిన మూడో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృత్యువు దారి మళ్లించిందా..

ప్రమాదానికి కారణమైన వ్యాన్ నిజానికి గామన్ బ్రిడ్జి వంతెనపై నుంచి దిగి పేపర్‌మిల్లుకు వెళ్లాలి. అయితే ఆమెపై పగబెట్టిన విధి ఆ వ్యాన్‌ను దారి తప్పించేలా చేసింది. గామన్ వంతెనపై నుంచి కిందకు దిగిన ఆ వ్యాన్ డ్రైవర్ పేపర్‌మిల్లు మార్గం ఎటో తెలియక అయోమయానికి గురై తొర్రేడు వైపు తిరిగి ఆమె మరణానికి కారణమయ్యాడు. విధి ఆ ఇంట ఆనందంతో ఆడుకుంది. వ్యాన్ డ్రైవర్ సవ్య దిశలో వెళ్లి ఉంటే ఈ ప్రమాదం జరిగేది కాదేమో అని స్థానికులు అనుకోవడం అందరినీ ఆవేదనకు గురిచేసింది.



ప్రమాద స్థలంలో రోదిస్తున్న బంధువులు



దేవి (ఫైల్)



ప్రమాదానికి ముందు బాలికలంతా కలసి దిగిన ఫొటో

ఆనందం.. అంతలోనే విషాదం

బాలిక మృతి, మరో నలుగురికి గాయాలు



ప్రమాదానికి కారణమైన లోడు ఆటో

కొత్తపల్లి: రాఖీ కట్టడానికి వెళ్లి తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక బాలిక మృతి చెందిన సంఘటన కొత్తపల్లి మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. పొన్నాడ శివారు కోనపాపపేటకు చెందిన ఉప్పరపల్లి బలరామ్ కుమార్తె ఉప్పరపల్లి దేవి (11) అక్కడి జిల్లా పరిషత్ పాఠశాలలో 6వ తరగతి చదువుతుంది. రాఖీ పౌర్ణమి కావడంతో దేవితో పాటు తన స్నేహితులు తిత్తి కస్తూరి, నాగవల్లి, దుర్గ, లక్ష్మిలు ఉప్పాడలో ఉన్న తమ బంధువులు ఇంటికి రాఖీ కట్టేందుకు వెళ్లారు. దేవి సోదరుడైన సంతోష్‌కు ఉప్పాడలో రాఖీలు కొనుగోలు చేసి తిరిగి ఆటోలో ఇంటికి బయలు దేరారు. ఉప్పాడ- కోనపాపపేట రోడ్డులో కొత్తమూలపేట సమీపంలోని రొయ్యల శుద్ధి పరిశ్రమ దగ్గరలోకి రాగానే ఎదురుగా వచ్చిన లోడు ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో దేవి సంఘటనా స్థలంలోనే దుర్మరణం పాలైంది. ఆటోలో ప్రయాణిస్తున్న కస్తూరి, నాగవల్లి, దుర్గ, లక్ష్మికి గాయాలు కాగా చికిత్స నిమిత్తం పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కస్తూరికి తీవ్ర గాయాలు కాగా మెరుగైన చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. దేవి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై ఎస్సై వెంకటేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. లోడు ఆటో కోనపాపపేట నుంచి అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతోనే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. మరికొద్ది నిమిషాల్లోనే తన సోదరి వచ్చి రాఖీ కడుతుందనుకుంటున్న సోదరుడు సంతోష్‌కు విషయం తెలియగానే తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాడు. దేవీ మృతితో కోనపాపపేటలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఆమె మృతదేహం వద్ద కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. వారి రోదనలు ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించాయి.

తల్లిదండ్రుల చెంతకు యువకుడు



నగదును, యువకుడిని తల్లిదండ్రులకు అప్పగించిన ఎస్సై పవన్‌కుమార్

ప్రత్తిపాడు: ఇంటి నుంచి పరారైన యువకుడిని ప్రత్తిపాడు పోలీసులు పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసుల కథనం ప్రకారం.. అడ్డతీగల మండలం రేగులపాడు గ్రామానికి చెందిన లోతా దుర్గా వెంకటేష్ ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. గత బుధవారం సుమారు రూ.లక్ష నగదుతో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. నగదు ఉన్న బ్యాగును అదే రోజు ప్రత్తిపాడు అంబేడ్కర్ కళామందిర్ వద్ద గల డైరీ షాపు వద్ద పెట్టాడు. ఏలేశ్వరం, జగ్గంపేట, విశాఖపట్నం తిరిగి, శుక్రవారం రాత్రి స్థానిక అంబేడ్కర్ కళామందిర్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తుంటే, యువకులు పోలీసులకు అప్పగించారు. రాత్రి కావడంతో దుర్గా వెంకటేష్‌ను అక్కడే ఉంచి, శనివారం తల్లిదండ్రుల వద్దకు పంపేశారు. అయితే ఇంట్లో నగదు గల్లంతైన విషయాన్ని గుర్తించిన తల్లిదండ్రులు ప్రత్తిపాడు పోలీసుల దృష్టికి తీసుకువచ్చారు. విచారించగా సదరు బ్యాగును షాపు వద్ద వదిలి వెళ్లిపోవడంతో షాపు యజమాని ముత్తింటి వెన్నెల భద్రపరిచారు. తమ వద్ద విద్యార్థులు తరచూ తమ బ్యాగులను మరిచిపోవడం, తిరిగి తీసుకువెళ్లడం సహజమంటూ ఆమె బ్యాగును పోలీసులకు అప్పగించింది. దీంతో ప్రత్తిపాడు ఎస్సై ఎం.పవన్‌కుమార్ పోయిన సొత్తు రూ.70 వేలు, బ్యాగును తల్లిదండ్రులు లోతా విజయకుమారి, రామిరెడ్డికి అప్పగించారు. నగదు బ్యాగును భద్రపరిచిన ముత్తింటి వెన్నెలను పోలీసులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ప్రత్తిపాడు: స్థానిక జాతీయ రహదారిపై రాచపల్లి అడ్డురోడ్డు జంక్షన్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎంఈఓతో పాటు మరో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఆ వివరాల ప్రకారం.. ప్రత్తిపాడు- 2 ఎంఈఓ వై.అచ్చిరాజు తన విధుల నిర్వహణలో భాగంగా ధర్మవరం నుంచి రాచపల్లి పాఠశాల తనిఖీకి బైక్‌పై వెళ్తున్నారు. రాచపల్లి అడ్డురోడ్డు జంక్షన్ వద్ద ధర్మవరం నుంచి ప్రత్తిపాడు వైపు ఇద్దరు యువకులు బైక్‌పై వేగం వచ్చి ఢీకొన్నారు. ఈ సంఘటనలో అచ్చిరాజుతో పాటు ఆ యువకులూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ప్రాథమిక చికిత్స అనంతరం ఎంఈఓను కాకినాడ ప్రైవేట్ ఆసుపత్రికి, యువకులను జీజీహెచ్‌కు తరలించారు.

కిలేడీ

- వృద్ధులే లక్ష్యంగా దోపిడీలు
- పలు జిల్లాల్లో చోరీలు
- చివరికి కటకటాలపాలు



మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ భవ్యకిశోర్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): వృద్ధులే లక్ష్యంగా నేరాలకు పాల్పడుతున్న ఓ కిలాడీ లేడీని తూర్పుగోదావరి జిల్లా పోలీసులు చాకచక్యంగా పట్టుకుని కటకటాల్లోకి నెట్టారు. దీనిపై సోమవారం రాజమహేంద్రవరంలో తూర్పు మండల ఇన్‌చార్జి డీఎస్పీ ఎస్.భవ్యకిశోర్, అనపర్తి సీఐ శివగణేష్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆ వివరాలు ఇలా.. కోనసీమ జిల్లా అంగర గ్రామానికి చెందిన నడిపిల్లి సూర్యచంద్ర చక్ర జగదాంబకు వివాహమైనా భర్తను వదిలి ప్రస్తుతం రాజమహేంద్రవరం రూరల్ బొమ్మూరులో నివాసం ఉంటోంది. గతంలో ఆమె పలు చోరీలకు పాల్పడి 16 నేరాలు చేసింది. ఇందులో 10 కేసులకు సంబంధించి జైలుశిక్ష అనుభవించి 2021లో విడుదలైంది. అయినా తన ప్రవర్తన మార్చుకోలేదు. నేరాలకు పాల్పడుతూ పోలీసులకు చిక్కకుండా తిరుగుతోంది.

నేరాలు చేసేది ఇలా..

తాను ముందుగా ఎంచుకున్న ప్రాంతంలో రెక్కీ నిర్వహిస్తుంది. ఒంటరి వృద్ధులు నివసిస్తున్న ఇంటిని ఎంచుకుంటుంది. మర్నాడు వారి ఇంటికి వెళ్లి పేరంటమంటూ బొట్టు పెట్టి పిలుస్తుంది. సమీపంలోనే నా ఇల్లు రండంటూ ఆహ్వానించి మాట కలుపుతోంది. తాను తెచ్చిన ప్రసాదం వారికి పెట్టి స్పృహ కోల్పోయేలా చేసి వారి ఒంటిపై బంగారం దోచుకుంటుంది. ఇంకో ఘటనలో ముందుగా ఎంచుకున్న వృద్ధుల ఇంటికి వెళ్లి తాను ఈ ప్రాంతానికి కొత్తగా వచ్చానని చెబుతోంది. పని ఉంటే చేస్తానని నమ్మబలుకుతుంది. మంచి రోజు చూసుకుని పనికి వస్తానని చెబుతుంది. ఈ రోజు తన పిల్లవాడి పుట్టిన రోజు అని చెప్పి కేకు తినమని, లేదా జ్యూస్ తాగమని మత్తుమందు కలిపి ఇస్తుంది. అది తిన్నాక ఆ వృద్ధులు స్పృహ కోల్పోయాక వారిని నిలువు దోపిడీ చేసి పత్తా లేకుండా పోతోంది. మరో ఘటనలో.. ఒంటరి వృద్ధులను ఎంచుకుని వారికి ఆసరాగా ఉంటానని తక్కువ జీతానికే పనికి కుదురుతుంది. వారికి అన్నం వండి పెడుతున్నట్లు నటిస్తూ మత్తు మందు కలిపి ఇస్తుంది. వారి ఒంటిపై ఆభరణాలే కాకుండా ఇల్లు మొత్తం దోచుకుని పరారవుతుంది. ఇలా కాకినాడ జిల్లా కాకినాడ, పెదపూడి, గండేపల్లి, కరప, పశ్చిమ గోదావరి జిల్లా పరిధి తణుకు, తాడేపల్లిగూడెం, తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు, నిడదవోలు, ఉండ్రాజవరం, బిక్కవోలు, రాజానగరం, అనపర్తి ప్రాంతాల్లో వృద్ధుల వద్ద సొత్తు దోచుకుంది.

పట్టుబడింది ఇలా..

ఇటీవల అనపర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన నేరంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. జిల్లా ఎస్పీ నరసింహకిశోర్ పర్యవేక్షణలో డీఎస్పీ భవ్యకిశోర్ ఆధ్వర్యంలో అనపర్తి సీఐ శివగణేష్ దర్యాప్తు చేశారు. గతంలో ఇదే తరహా నేరాలు చేసిన మహిళల వివరాలు తీసుకుని వారిపై నిఘా పెట్టారు. బొమ్మూరులో నివసిస్తున్న నడిపల్లి సూర్యచంద్ర చక్ర జగదాంబ ఈ నేరాలు చేసినట్టుగా సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించారు. ఆమెను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాల చిట్టా బయట పెట్టింది. ఆమె నుంచి 6 కేసులకు సంబంధించి 34 కాసుల బంగారం స్వాధీనం చేసుకున్నారు. మరో 12 కేసులకు సంబంధించిన దోచుకున్న బంగారం ప్రైవేట్ బ్యాంకుల్లో కుదువ పెట్టి ఉండటంతో వాటిని రికవరీ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. సీఐతో పాటు కేసు దర్యాప్తులో ప్రతిభ కనబరిచిన అనపర్తి ఎస్సై కె.రామారావు, హెచ్‌సీ కె.సురేష్, కానిస్టేబుళ్లు తమ్మారావు, తిరుమలయాదవ్, జి.వెంకటేష్, మహిళా కానిస్టేబుల్ వెంకటలక్ష్మిలను ఎస్పీ అభినందించారు.

ఐదు కేసుల్లో ముఠా అరెస్ట్

- ఇందులో ఇద్దరు రౌడీ షీటర్లు
- రూ.11.80 లక్షల సొత్తు స్వాధీనం



గంజాయి, కారు, నిందితులను పట్టుకున్న కొవ్వూరు పట్టణ పోలీసులు

కొవ్వూరు: గంజాయి తరలిస్తూ ఏడుగురు సభ్యుల ముఠా సోమవారం కొవ్వూరు పోలీసులకు చిక్కింది. దీనిపై సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ పి.విశ్వం విలేకర్ల సమావేశం నిర్వహించారు. పట్టణానికి చెందిన కంచుబాని దినకర్, భూపతి అశోక్, భూపతి అశ్వర్థ, కొరివేటి పోసికుమార్, దొమ్మేరుకు చెందిన కండింపల్లి సిద్ధార్థ, యర్నగూడెం గ్రామానికి చెందిన గిశాల రవికుమార్, పోలవరం గ్రామానికి చెందిన చెట్టేబత్తుల హర్షవర్ధన్‌లు ముఠాగా ఏర్పడ్డారు. వీరు కారులో గంజాయి తరలిస్తుండగా గామన్ ఇండియా బ్రిడ్జి జంక్షన్ సమీపంలో పోలీసులు పట్టుకున్నారు. 25 కిలోల రెండు గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లాలో జి.మాడుగుల నుంచి ఈ గంజాయిని తీసుకు వస్తున్నారు. అక్కడ గంజాయి అమ్మిన వ్యక్తులు, ఇక్కడ ఎవరు కొంటున్నారనే దానిపై పోలీసులు విచారణ చేస్తున్నారు. ఈ నిందితులను విచారించగా, మరో ఐదు కేసుల్లో నేరాలకు పాల్పడినట్లు తేలింది. దేవరపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు, కొవ్వూరు పోలీస్ స్టేషన్ పరిధి దొమ్మేరులో ఒకటి, కొవ్వూరులో ఒకటి, రాజానగరం పరిధి కొంతమూరులో ఒక చోరీ చేసినట్లు అంగీకరించారు. నిందితులు చోరీ చేసిన సొత్తును పోలవరానికి చెందిన హర్షవర్ధన్ ద్వారా విక్రయించేవారు. ఇందులో రౌడీషీటర్లు కంచుబాని దినకర్, గిశాల రవికుమార్. నిందితుల నుంచి ఓ కారు, ఎనిమిది గ్రాముల బంగారు ఆభరణాలు, 1,600 గ్రాముల వెండి, రెండు టీవీలు, ఎలక్ట్రానిక్ ఓవెన్, గ్యాస్ సిలెండర్, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం సొత్తు విలువ రూ.11.80 లక్షలు ఉంటుంది. ఇంట్లో ఎవరూ లేరని గుర్తించి వీరు చోరీలు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ ముఠాను పట్టుకున్న ఎస్సై కె.జగన్‌మోహన్‌రావుతోపాటు బృందం ఏఎస్సై జీజీ ప్రకాష్, హెడ్ కానిస్టేబుల్ ఆర్.సత్యనారాయణ, జె.శ్రీనివాసరావు, కానిస్టేబుళ్లు రాము, లవ, బేగ్ రెహ్మతుల్లాలను సీఐ అభినందించారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ



తైక్వాండో పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): విజయనగరంలో ఈ నెల 17, 18 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి సీనియర్స్, జూనియర్స్ తైక్వాండో పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టు ప్రతిభ కనబరిచి ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించింది. ఇందులో జిల్లా నుంచి 39 మంది పాల్గొనగా 12 బంగారు, 16 రజత, 11 కాంస్య పతకాలు కైవసం చేసుకుని 148 పాయింట్లతో ప్రథమ స్థానంలో నిలిచారు. 89 పాయింట్లతో విశాఖ ద్వితీయ స్థానం, 80 పాయింట్లతో కడప తృతీయ స్థానం సాధించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టుకు కోచ్‌గా బి.అర్జునరావు వ్యవహరించారు. క్రీడాకారులను తీర్చిదిద్దిన అసిస్టెంట్ కోచ్‌లు కేవీ సత్యనారాయణ, పి.త్రిమూర్తులు, డీఎస్ సత్యనారాయణ మూర్తి, ఎస్.తులసి, జి.లక్ష్మీనారాయణను అర్జునరావు అభినందించారు. ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించిన జిల్లా జట్టుకు డీఎస్‌డీ బి.శ్రీనివాస్‌కుమార్, ఒలింపిక్ సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, కార్యదర్శి ఎలీషా బాబు శుభాకాంక్షలు తెలిపారు.

భార్యపై కత్తితో దాడి

అల్లవరం: భార్యపై ఓ భర్త కత్తితో దాడి చేసిన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. అల్లవరం మండలం రెల్లుగడ్డ పంచాయతీ ఎలువుల్లంకకు చెందిన బొంతు నాగేశ్వరరావుకి లక్ష్మితో సుమారు 30 ఏళ్ల కిందట వివాహమైంది. పదేళ్ల కిందట లక్ష్మి గల్ఫ్ వెళ్లింది. అక్కడ మూడేళ్లు పని చేసి స్వగ్రామానికి తిరిగి వచ్చింది. స్వగ్రామానికి వచ్చిన నాటి నుంచి దంపతుల మధ్య మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. ఆరేళ్లుగా నాగేశ్వరరావు నుంచి లక్ష్మి విడిపోయి తన కుమారుడు, కుమార్తెతో కలసి అమలాపురంలో అద్దె ఇంట్లో నివాసం ఉంటుంది. గత నెలలో లక్ష్మి కుమారుడు ప్రేమ పెళ్లి చేసుకున్నాడు. రెల్లుగడ్డలోని వారి సొంత నివాసంలో ఆదివారం ఉదయం కుటుంబ సభ్యుల సమక్షంలో నూతన దంపతుల రిసెప్షన్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని నాగేశ్వరరావు, లక్ష్మి దంపతులు చక్కగా నిర్వహించారు. అనంతరం లక్ష్మి తన కుమారుడు, కుమార్తెతో కలసి తిరిగి అమలాపురానికి బయలుదేరింది. లక్ష్మి తనతో కాపురం చేయదేమోనన్న అనుమానంతో నాగేశ్వరరావు భార్యతో ఘర్షణకు దిగాడు. అంతటితో ఆగకుండా కత్తితో దాడి చేశాడు. భర్త చేతిలో గాయపడిన లక్ష్మిని స్థానికులు అమలాపురంలోని కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు అల్లవరం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ఘటనపై ఏఎస్సై జంగా సత్యనారాయణ కేసు నమోదు చేశారు. ఎస్సై హరీష్‌కుమార్ విచారణ చేపట్టారు.

నిందితుడి అరెస్ట్

కొవ్వూరు: స్థానిక ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న ఖండవల్లి జయరాజుని చాకుతో పొడిచిన కేసులో పిండి సుబ్రహ్మణ్యంను డీఎస్పీ జి.దేవకుమార్ అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరు పరిచామన్నారు.

విద్యుదాఘాతంతో టిప్పర్ డ్రైవర్ మృతి



మృతి చెందిన కొక్కిరిపాటి రాజు

రాజానగరం: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధి కాతేరులో విద్యుదాఘాతానికి ఓ టిప్పర్ డ్రైవర్ మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి సీఐ వీరయ్యగౌడ్ సోమవారం తెలిపిన వివరాలు ఇలా.. ఆదివారం సాయంత్రం పశ్చిమగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం మలకపల్లెకు చెందిన కొక్కిరిపాటి రాజు (55) గౌరీపట్నంలోని క్వారీ నుంచి టిప్పర్‌లో నల్లకంకరను తీసుకు వస్తున్నాడు. రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరులోని ఎన్‌బీవీ లేఅవుట్‌లో కంకర అన్‌లోడు చేస్తున్న సమయంలో టిప్పర్ హైడ్రాలిక్ లిఫ్ట్‌కు విద్యుత్ తీగలు తగిలాయి. దీంతో విద్యుదాఘాతానికి గురై రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి అల్లుడు ఉండ్రాజారపు పాపారావు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. కేసును ఎస్సై మనోహర్ దర్యాప్తు చేస్తున్నారు.

ఏమైందో ఏమో..

ఉరి వేసుకుని ఇద్దరి మృతి

జగ్గంపేట: ఏమైందో ఏమో ఇద్దరు ఉరి వేసుకుని మృతి చెందారు.. ఆ యువతీ యువకుడి మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జగ్గంపేట ఎస్సై రఘునాథరావు కథనం ప్రకారం.. జగ్గంపేటకు చెందిన పిండి నానాజీ (25), కన్నాబత్తుల సాయిప్రసన్న (22)లు ఒక ఇంట్లో సహజీవనం సాగిస్తున్నారు. నానాజీ తల్లిదండ్రులతో కలసి స్థానిక టవర్ కాలనీలో ఉంటూనే, జగనన్న కాలనీలో సాయిప్రసన్నతో కొంతకాలంగా సహజీవనం చేస్తున్నాడు. ఏమైందో తెలియదు గాని వీరు ఉంటున్న ఇంట్లో సోమవారం ఉదయం ఆ ఇద్దరూ ఉరి వేసుకుని మృతి చెందారు. సాయిప్రసన్న వివరాలు తెలియాల్సి ఉండగా, వీరు మృతి చెందడానికి దారి తీసిన కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. దీనిపై కేసు నమోదు చేసి, విచారణ చేస్తున్నామని ఎస్సై వివరించారు.